# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, అక్టోబర్ 28 : ఎలక్షన్ కార్యకలాపాలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కే శశాంక సూచించారు. శనివారం ఐడీవోసీలోని కలెక్టర్ కార్యాలయంలోని ఎలక్షన్ కార్యకలాపాల విభాగాన్ని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి పర్యవేక్షించారు. కాల్ సెంటర్, సీ విజిల్, సోషల్ మీడియా, మీడియా ధ్రువీకరణ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 24/7 అన్ని విభాగాలు పని చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందికి సలహాలు ఇస్తూ అవగాహన కల్పించాలని చెప్పారు. సిబ్బంది విధుల సమయాలను తప్పక పాటించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజూ టీవీలో జిల్లాకు సంబంధించిన పాజిటివ్, నెగటివ్ వచ్చిన సమాచారాన్ని రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సంబంధిత అధికారులకు తెలియజేసి, రిజిస్టర్‌లో సంతకం తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట పశు సంవర్ధక శాఖ అధికారి సుధాకర్, గ్రౌండ్ వాటర్ అధికారి సురేశ్, ఈడీఎం ప్రశాంత్ ఉన్నారు.


ఎన్నికల విధుల శిక్షణ తరగతులపై సమీక్షిస్తున్న కలెక్టర్ శశాంక

**శిక్షణ తరగతులకు హాజరవ్వాలి ..**

ఎన్నికల్లో విధులు చేసేందుకు నిర్వహించే ఎన్నికల శిక్షణ తరగతులకు అధికారులు తప్పకుండా హాజకావాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. శనివారం ఐడీవోసీలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల శిక్షణ తరగతుల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ శశాంక సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలాఖరులో నిర్వహించే ఎన్నికల శిక్షణ తరగతులకు విధులు కేటాయించిన అధికారులు హాజరుకావాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని ఫాతిమా స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విడుతల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళిక రచించుకోవాలన్నారు. శిక్షణ తరగతులకు హాజరయ్యే అధికారులకు తగు సమాచారం అందేలా బల్క్ మెసేజ్ ప్రక్రియను వినియోగించుకోవాలని తెలిపారు. జడ్పీ డిప్యూటీ సీఈవో నర్మద, సీపీవో స్టాటిస్టికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, గ్రౌండ్ వాటర్ అధికారి సురేశ్, ఈడీ స్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్ పాల్గొన్నారు.


కుమ్రం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న తుడుందెబ్బ నాయకులు

## కుమ్రం భీం ఆశయ సాధనకు కృషి చేయాలి

బయ్యారం, అక్టోబర్ 28 : ఆదివాసీలు కుమ్రం భీం ఆశమ సాధనకు కృషి చేయాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వీ ఉపేందర్ అన్నారు. కుమ్రం భీం వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వట్టం కన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి స్వామి, కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, చింత సమ్మయ్య, వాసం వెంకన్న, తుడుందెబ్బ బయ్యారం మండలాధ్యక్షుడు పార్థు, ప్రధాన కార్యదర్శి మల్సూర్, నాయకులు శీను, రామారావు, శ్రీను, రమణ పాల్గొన్నారు.

## ఘనంగా ఉర్సు..

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 28 : మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో ఉన్న హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా 10వ ఉర్సు ఉత్సవాలను శనివారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉర్సు కందిల్ జెండాలను ప్రభుత్వ పాఠశాల నుంచి డీజే చప్పుళ్లతో పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న మహబూబ్ దర్గాకు తీసుకు వెళ్లి ప్రతిష్ఠించారు. ఉర్సు ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని ముస్లిం సోదరులతో కలిసి దర్గాలో నమాజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు కందిల్ కమిటీ సభ్యులు షేక్ యూసుప మస్తాన్, లతీఫ్, ఖాదర్ బాబా, జావిద్, పాషా, షరీఫ్, యాకూబ్, సద్దాం పాల్గొన్నారు.

## వారోత్సవాలను జయప్రదం చేయాలి

మహబూబాబాద్, అక్టోబరు 28 : అమరవీరుల సంస్మరణ సభల వారోత్సవాలను సయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో నవంబర్ 1 నుంచి 9 వరకు అమరవీరుల సంస్మరణ సభలను నిర్వహించేందుకు స్థూపాలు, జెండాలను సిద్ధం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు హలావత్ లింగ్యా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విప్లవ ఉద్యమంలో దున్నే వాడికే భూమి కావాలని దొరలు, భూస్వాములను ఎదిరించి పోరాడి పేదవాడికి రాజ్యం రావాలని నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని నాటి నుంచి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ సబ్ డివిజన్ కార్యదర్శి ఎస్కే బాబన్న, డివిజన్ నాయకులు సామ పాపయ్య, యాస వెంకటనారాయణ, నున్న ఉపేందర్, అన్నారపు హన్మంతు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడిగా రూప్లా

కురవి, అక్టోబర్ 28: డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆదేశాల మేరకు పార్టీలో చురుగ్గా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కురవి మండలం లింగ్యాతండా(కే) గ్రామానికి చెందిన బాదావత్ రూప్లా(రపేలా)ను మండల ఉపాధ్యక్షుడిగా, అదే గ్రామానికి చెందిన బాదావత్ వెంకన్నను పార్టీ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు బీఆర్ఎస్ కురవి మండలాధ్యక్షుడు తోట లాలయ్య తెలిపారు. ఈ సందర్భంగా రూప్లా, వెంకన్న మాట్లాడుతూ.. మాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, జిల్లా నాయకులు బజ్జూరి పిచిరెడ్డి, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ రమేశ్‌తో పాటు గ్రామ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలయ ద్వారా బంధనం..

కురవి, అక్టోబర్ 28 : చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని కురవి వీరభద్రస్వామి ఆలయం శనివారం సాయంత్రం ఐదుగంటలకు ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది ద్వారా బంధనం చేశారు. అర్చకులు ప్రదోషకాల పూజకు అవకాశం లేనందున లఘుపూజ నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. తిరిగి నేడు ఆదివారం ఉదయం 4:30కు ఆలయ తలుపులు తెరియనున్నట్లు తెలిపారు.


కురవి గర్భగుడికి తాళం వేస్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది

# బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలి


పూజలు చేస్తున్న మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సూరయ్య, పార్టీ నాయకులు

గంగారం, అక్టోబర్ 28 : ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆదివాసీ ముద్దుబిడ్డ బడే నాగజ్యోతిని మెజార్టీతో గెలిపించాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సూరయ్య కోరారు. శనివారం మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామంలో గ్రామదేవతలకు, బొడ్రాయి వద్ద పార్టీ కార్యకర్తలతో కలిసి కొబ్బరి కొట్టి పూజలు చేశారు. మండల కేంద్రంలోని గ్రామ కమిటీ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బొడ్రాయి వద్ద నాగజ్యోతిక్కు గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం చేస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సూరయ్య మాట్లాడారు. రానున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అని కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు చెన్నూరి వెంక న్న, జెజ్జరి నర్సింహారావు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ జనగం రవి, లక్ష్మయ్య, సాంబయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాటోత్ హరీశ్ నాయక్

## ప్రభుత్వం పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలి

ఇనుగుర్తి, అక్టోబర్ 28 : మహబూబాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వద సభకు భారీగా ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి మండల ఎన్నికల ఇన్‌చార్జి జాటోత్ హరీశ్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వద సభ విజయవంతం చేయడానికి కృషి చేసిన గ్రామ పార్టీ అధ్యక్షులకు, కార్యదర్శులకు, మండల కమిటీ నాయకులకు, సభ్యులకు, ప్రజాప్రతినిధులకు, యూత్ నాయకులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఈ నెల 30 రోజులు ప్రతి గడప గడపకూ వెళ్లి ప్రచారం చేసి గత ప్రభుత్వాలు చేయని అనేక సంక్షేమ పథకాలు మన కేసీఆర్ ప్రభుత్వం అందిస్తుందని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చాడు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ దికొండ వెంకన్న, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ రెడ్డి, సర్పంచ్‌లు రామ్మూర్తి, రామన్న నాయక్, ఎంపీటీసీలు రజితా‌శ్రీనివాస్, మాలోత్ మంజులామంగ్య నాయక్, ఉప సర్పంచ్ గుండ్రపల్లి దేవేందర్, లాలుతండా గ్రామపార్టీ అధ్యక్షుడు వీరూనాయక్ పాల్గొన్నారు.

# ఘనంగా వేట వేంకటేశ్వర స్వామి కల్యాణం

గార్ల, అక్టోబర్ 28 : మద్రిగూడెం వేట వేంకటేశ్వర స్వామి కల్యాణం శనివారం కమనీయం జరిగింది. వేట వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ దేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి భక్తజన సందోహం మధ్య వేద మంత్రోచరణతో అర్చకులు ఘనంగా కల్యాణ తంతు నిర్వహించారు. వేట వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం గోవిందా.. గోవిందా.. నామ స్మరణతో మారుమోగింది. అమ్మపాలెం గ్రామానికి చెందిన మల్లం వంశీయులు స్వామి వారి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు డప్పు వాయిద్యాలతో తీసుకొచ్చారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూలమాలతో అలంకరించి గడి చుట్టూ ప్రదక్షణలు చేయించారు. సంప్రదాయ బద్ధంగా అన్నం అనిల్, పూజిత, సుముద్రాల శేషాచార్యులు, జోష్నాదేవి, టీ తరుణ్ అభిజ్ఞ యూడాగ్ని శ్రీనివాస్ స్వామి, వసుందర దంపతులు పెండ్లి పీఠంపై కూర్చుని స్వామి వారి కల్యాణ తంతు వేద పండితులు నిర్వహించారు. కల్యాణానికి మంత్రి సత్యవతి రాథోడ్, రాజ్య సభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఏఎంసీ చైర్మన్ బీ హరిసింగ్ నాయక్, ఎంపీపీ శివాజీ చౌహాన్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, రమేశ్ బాబు, కుటుంబ రావు, రాధాకృష్ణ, శ్రీనివాస గుప్తా, కోట ఉత్తరయ్య పాల్గొన్నారు.


స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

## అధిక సాంద్రత పత్తితో అధిక దిగుబడి

కురవి, అక్టోబర్ 28 : అధిక సాంద్రత పత్తితో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల వారి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతుల్లో ప్రత్తి సాగుపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఏవో లక్ష్మీనారాయణ, కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మాలతి, శాస్త్రవేత్త కిశోర్ రైతులను ఉద్దేశించి అధిక సాంద్రత పద్ధతుల్లో ప్రతి పంటలో రైతులు పాటించు యాజమాన్యం, దిగుబడులపై రైతులకు వివరించడం జరిగింది. మేక వెంకట్‌రెడ్డి రాశి సీడ్స్ క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న ప్రతి పంటను సందర్శించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దేశీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేందర్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి ఎం మంజుఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారులు బీ పున్నమీ, జీ దేవా, రాశి సీడ్స్ టెరిటరీ మేనేజర్ పెంతల రాజిరెడ్డి, పీవో సంతోష్, సీడ్స్ టైలరింగ్ మురళి, మేకవెంకట్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.


రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు